# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం ఈరోజు అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగింది.
- కేంద్ర ఆర్థిక సర్వేను కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో ఈ రోజు ప్రవేశపెట్టారు.
- ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 26వ తేదీ వరకు జరుగుతాయని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.
- రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజ్ కు మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

==========================

ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమి శాసన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "శాంతిభద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని అన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని తొలిరోజే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేద్దామని అన్నారు. ముందుగా రోడ్లకు పడిన గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడదామని తెలిపారు. అదేవిధంగా జనసేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... నెల రోజుల్లోనే ప్రభుత్వంపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. జనసేన పార్టీ నూటికి నూరు శాతం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భారతీయ జనతా పార్టీ శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==========================

దేశ ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేదిగా ఉండే ఆర్థిక సర్వే 2023-24ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో ఈ రోజు ప్రవేశపెట్టారు. కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలో ఈ నివేదికను రూపొందించారు. బడ్జెట్‌లో 'సులభతర వాణిజ్యం'పై చాలా నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కేంద్ర బడ్జెట్ 2024-25ను నిర్మలా సీతారామన్ రేపు ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సర్వేలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను దేశ వాస్తవ జీడీపీ 6.5 నుంచి 7 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేశామని అన్నారు. ఈ బడ్జెట్ లో సులభతర వాణిజ్యంపై దాదాపు 11 దశల్లో చర్చలు జరిగాయని ఆర్థిక మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈనెల 26 వరకు జరుగుతాయని శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. అసెంబ్లీలో ఈరోజు నిర్వహించిన బీఏసీ సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ సమావేశాల్లో రెండు బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఆరోగ్య వర్సిటీ పేరు మార్పు బిల్లు వీటిలో భాగంగా ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు ప్రభుత్వం కొన్ని శ్వేతపత్రాలు ప్రవేశపెడుతుందని వెల్లడించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోపు నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. శాసన సభ్యుల నివాస భవనాల నిర్మాణాలు 80 శాతం పూర్తయ్యాయని, 9 నెలల్లో అవి అందుబాటులోకి వస్తామని అయ్యన్నపాత్రుడు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అసెంబ్లీ ఉమ్మడి సమావేశాలకు హాజరైన నూతన శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొని మార్పు కావాలని కోరుకున్నారని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత శాసనసభ్యులపై ఉందని గవర్నర్ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం సభాపతి శాసనసభను రేపటికి వాయిదా వేశారు. ఆ తరువాత అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు జనసేన పార్టీ తరపున పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్, అసెంబ్లి వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, బిజేపి శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు గోదావరి జిల్లా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ధవళేశ్వరం బ్యారేజ్ కు మొదటి ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఈ రోజు జిల్లాలోని పుష్కర్ ఘాట్, చందా సత్రం పునరావాస ప్రాంతాలను అధికారులతో కలసి కలెక్టర్ పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బ్రిడ్జిలంకలో నివసిస్తున్న 175 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో వున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే ఈ కేంద్రాలకు వచ్చిన వారికి వసతి ఏర్పాట్లతో పాటు అల్పాహారం, భోజన సౌకర్యం, వైద్య సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు హాజరయ్యారు. అగ్నిప్రమాదంలో అసైన్డ్ భూముల దస్త్రాలు దగ్ధమైనట్లు అధికారులు ప్రాథమిక సమాచారం అందజేశారు. నిన్న రాత్రి 11 గంటల 24 నిమిషాలకు ప్రమాదం జరిగినట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్గిల్ విజయ్ దివాస్ 25వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26వ తేదిన లడఖ్‌కు వెళ్లనున్నారు. కార్గిల్ జిల్లాలోని ద్రాస్‌లో ఈనెల 24 నుండి 26 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకాన్ని ప్రధానమంత్రి సందర్శించనున్నారు. అనంతరం వాల్ ఆఫ్ ఫేమ్, కార్గిల్ వార్ మ్యూజియన్ని సందర్శిస్తారు. ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ బి.డి.మిశ్రా పర్యవేక్షిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ధవళేశ్వరం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఇప్పటికే జారీ చేయడం జరిగిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలైన ముమ్మిడివరం మండలంలోని గురజాపులంక, అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం కాజ్వే, పి గన్నవరం మండలంలోని గంటి పెదపూడిలలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గోదావరి వరద ముంపు బారిన పడే మండలాల్లోని గ్రామాల్లో పర్యటిస్తామని పేర్కొంటూ....

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు మధ్యప్రదేశ్ దానిని ఆనుకుని ఉన్న అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలో మీటర్ల వరకు విస్తరించి వుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పల్నాడు జిల్లా పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో 46 ఆలయాలు పునః నిర్మాణం చేయాల్సి ఉందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈ రోజు శాసనసభలో మంత్రి మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం 36 కోట్ల రూపాయల నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆలయ నిర్మాణాలు జరిగితే నిధులు విడుదల అవుతాయని ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నకిలీ ధృవ పత్రాలతో సెల్ ఫోన్ సిమ్ కార్డులను పొంది సైబర్ నేరాలకు పాల్పడే ఉదంతాలు అనేకం వెలుగు చూస్తున్న నేపథ్యంలో టెలికాం శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు పాయింట్ ఆఫ్ సేల్స్ ప్రతినిధులను అప్రమత్తం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈరోజు జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ టెలికామ్ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ J.V. రాజారెడ్డి, డైరెక్టర్ G.V. మనోజ్ కుమార్ ల బృందం పాయింట్ ఆఫ్ సేల్ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు.

==========================

రాష్ట్ర ప్రభుత్వం తోటపల్లి నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో అక్రమణలను తక్షణమే తొలగించాలని పార్వతీపురం మన్యం  జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవనాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి 69 అర్జీలు అందాయని తెలిపారు.

==========================

==========================